# అంటనిసిరి

వెంకయ్య పొద్దునేలేచి మొలలో వుంచుకున్న డబ్బు వున్నదో లేదో చూసుకున్నాడు. లేకపోగానే ప్రాణాలు పైకి పోయినట్టనిపించి గాభరాగా అటూయిటూ చూశాడు. మంచంమీదే వున్నాయి ఆరు యిచ్చురూపాయలు. మనసు కుదుటబడి రూపాయిలు చేతిలోకి తీసుకుని మళ్ళీ మంచంమీద కూర్చున్నాడు. రూపాయలు ఒక్కొక్కటే బొటనవ్రేలు మీదుంచి "ఠింగు ఠింగున" పైకి ఎగరవేసి అన్నీ మంచి రూపాయలేనని మరొకసారి ధైర్యం తెచ్చుకున్నాడు. ఒక్కొక్క రూపాయికే అటూ యిటూ బొమ్మా బొరుసూ పరీక్షగా చూశాడు.

"ఏటలా సూస్తున్నావు మావా? ఇయ్యాల కూలి కెల్లవేటి?" అంది నరిసి. వెనక్కితిరిగి పెళ్ళాం మొహంచూసి నవ్వేడు వెంకయ్య, "సూసేవా నరిసీ రూపాయకి ఓ పేపు బొమ్మా, ఓ పేపు బొరుసూ, కష్టం సుఖం నాగ."

"ఓలమ్మో ఏటా యేదాంతం, నెగునెగు, ఎప్పుడూ రూపాయి మొఖ మెరగవేటి?"

"ఆరు రూపాయలు ఒకేపాలి ఎప్పుడొచ్చినాయే, కాసింతసేపు సరదాతీరా సూడనీ."

"ఉత్తినే వొచ్చినాయేటి సేసిన కష్టమో?"

"ఎర్రిదానా! కష్టపడితేమాత్రం ఎవరిస్తార్నేవే. డబ్బులిచ్చేవోడుంటే మనమేనేటి కష్టపడనేం? ఆ సావుకారింట్లో కూతురి పెళ్లిగాబట్టి రెండురోజులు కూలిపనిసేస్తే సటుక్కున

తోలుసంచితీసి ఆరురూపాయిలిచ్చేసినాడు. రోజు పెళ్ళిళ్లవుతాయా, అంతా అలాంటి దరమాత్ముళ్లే వుంటారా?"

"ఆడికేం, కూతురుపెళ్ళికి ఏలకుయేలు కర్చుసేసినాడు గాదా? ఆడుకొల్సిన మందుగుండుసామాను పాటిసెయ్యాదు మనబతుకు."

"అదంతేనే నరిసీ, నోకమే అలాగుంటే మనమేటి సేస్తాము. మనంసేసిన పనికి ఆడెంతిచ్చాడని సూసుకోవాలే. రెండురోజులూ బువ్వెట్టినాడుకూడా గదా?"

"ఏటేటి వొండినారు మావా?"

"ఏటడుగుతావు పిల్లా, పొద్దున మరి సల్దిగంజినేదు. కాఫీ, ఉపమ. ఉపమలో మిరపకాయ లేసినారే! మహాకారంగున్నాయినే. సావుకార్లయితే పురుగులేరినట్లు ఏరి అవతల పారేస్తారు, నేకపోతే గూబ 'గుయ్' మనదూ. మధ్యాన్నం రెండుకూరలు, బూరెలు, పరవాన్నం, సద్ది – మహా మజా అయిన భోజనంలే. గుమ్మడికాయకూర బెల్లమేసి వొండినారే! అబ్బ నా జలమలో తినలేదనుకో అనాంటి కూర."

నరిసికి నోరూరింది. "పోనీలే మావా, నాకు కాసింత తెచ్చినావుకావు."

"ఛ, ఆల్లనడిగేదేటి, బుగతగోర్ని అడిగి గుమ్మడికాయ సెక్క తెస్తా నియాల, నువ్వొండరాదూ."

"ఒట్టుకురా, బెల్లంకూడా తే. అయ్యొయ్యో మరిసేపోనాను, బియ్యం నేవసలు. ఒక రూపాయిలా పడే, గింజ లొట్టుకొస్తాను."

వెంకయ్య ఒకక్షణం ఆలోచించి ఒక రూపాయి పెళ్ళాం ఒడిలో పడేశాడు. నరిసి రూపాయి పట్టుకుని లోపలి కెళ్ళింది.

వెంకయ్య మిగిలిన అయిదురూపాయలు ఒక్కొక్కటే మళ్ళీ బొటనవేలుమీద పెట్టి "టింగుటింగు"న ఎగరవేశాడు. రూపాయలు చూస్తూవుంటే వాడికి షావుకారే జ్ఞాపకం వచ్చాడు. షావుకారు తన యీడువాడే. వాడు పన్నెండో ఏటే వ్యాపారం మొదలుపెట్టేడు. తను ఎనిమిదో ఏట కూలిపని ప్రారంభించాడు. వాడి వయసుతో బాటు వ్యాపారంకూడా పెద్ద దయింది వేలకువేలు డబ్బు గడించాడు. వాడి వ్యాపారం వాడినంత వాణ్ణి చేసింది. తనీ కూలిపని చేసుకుంటూ అప్పుడూ ఇప్పుడూ ఒకలాగే వున్నాడు. పగలల్లా ఒళ్ళు విరుచు కుంటే రూపాయిడబ్బులు దొరకడమే కష్టం. తనుకూడా వ్యాపారంచేస్తే ... పట్టుదలవుంటే యీ అయిదురూపాయిల మదుపు చాలదా? షావుకారు మొదట్లోపెట్టిన పెట్టుబడి అయిదురూపాయలుకూడా వుండదు. అయితే తనకు చేతనయిన వ్యాపారం ఏమిటి? ఉప్పు, పప్పు, అల్లం, బెల్లం, గారెలు, అప్పాలు—ఛీ, ఇవన్నీ చెయ్యడం అమ్మడం తనకేం కర్మం. గారెల్లో వుప్పు ఎక్కువైందనీ, అప్పాల్లో బెల్లం తక్కువైందనీ నలుగురిచేతా నానా మాటలు పడాలి. అయితే మరి చెయ్య గలిగినదేమిటి? ఏదో వొకటి చెయ్యాలి. చెయ్యక ఎంతకాలం యిలా ?

వెంకయ్య మంచంమీంచి లేచి లోపలికెళ్ళి పళ్ళు

తోముకుని గంజితాగి బయలుదేరాడు. నరిసి అడిగిన ప్రశ్నలు వినిపించుకోలేదు. ఏదో పరధ్యాన్నంలో పడ్డాడు.

ఈ అయిదురూపాయలతో ఏమి చెయ్యడమా అని ఆలోచిస్తూ బయలుదేరాడు. ఊరుదాటి చెరువుగట్టంట నడుస్తూ, చెరువులో చేపలు పడుతున్న జాలరివాళ్ళను చూస్తున్నాడు. 'చుర్రు'మంటున్న ఎండలో జాలరివాళ్ళ శరీరాలు నిగనిగ మెరుస్తున్నాయి. దూరంనుంచి చూస్తూవుంటే వాళ్ళు విసిరే వల చెరువంతా ఆవరించుకునేటట్లు కనిపిస్తుంది. జాలరులు వేసే వలలో చేపలుపడతాయి. లోకం తీరే అంత. ఒకరు వల వెయ్యడం, యింకొకరు వలలో పడడం.

వెంకయ్య చెట్టునీడకు వచ్చి కూర్చున్నాడు. చెరువులో జాలరులు వలలాగి చేపలు పైకితీసి బుట్టలో వేస్తున్నారు. వీళ్లు పగల్లా ఎండనక వాననక కష్టపడి చేపలుపడతారుగాని తన లాగే ఒక పూట తిని రెండోపూట గంజితాగి పడుకుంటారు. వీళ్ళు యీ చేపల వ్యాపారమే ఎందుకు చెయ్యరు? ఈ ప్రశ్నకు జవాబు దొరకలేదు వెంకయ్యకు. చెవి సందునున్న చుట్టపీక తీసి ముట్టించాడు. చెట్టునీడ చల్లగావుంది. మరో నిముష ముంటే నిద్రకూడా రావచ్చును. అయినా ఎందుకిలా కూర్చోవడం? పోయి ఏదేనా కూలీనాలీ చేసుకుంటే ఒక రూపాయి డబ్బులేనా దొరుకుతాయి. అయితే మళ్ళీ కూలిపనేనా? పోనీ యీ జాలరివాళ్ళదగ్గర చేపలు కొంటే, కాని షావుకారితో తనేం పోటీపడగలడు? తను రూపాయిస్తే వాడు రెండివ్వగలడు. అయినా అది అయిదురూపాయల పెట్టుబడితో జరిగే పని కాదాయె. ఏంచెయ్యడం?

వెంకయ్య పరధ్యానంలోంచి చటుక్కున లేచి వీపు తడుముకున్నాడు. వీపు "చురుక్కు"మన్నది. "ఛ, దీని తల్లీ సిగగొయ్య, కండచీమ" అనుకున్నాడు. చెట్టు మొదలునుండి చివరివరకూ ఒక్కసారి చూశాడు. తొగరచెట్టు బాగా బలిసి వుంది. తొగరపువ్వుల తియ్యటివాసన గుమగుమలాడుతూంది. చెట్టుమానుమీద చీమలు బారులుకట్టి ప్రాకుతున్నాయి. నేల బడిన తొగరపువ్వు తీసి వాసనచూశాడు వెంకయ్య.

ఈ చెట్టు తన చెవిలో ఏదో రహస్యం చెప్పినట్లయింది. తన వ్యాపారం యీ చెట్టుతోనే ప్రారంభించవచ్చును. ఈ చెట్టు అయిదురూపాయలకంటె ఎక్కువచెయ్యదు. ఇది కొని, ముక్కలుకొట్టి, వంటచెరుకుగా అమ్మితే రెండుమూడు రూపాయలు లాభంరాదా? తరవాత ఆ డబ్బుతో ఒక పెద్ద చింత చెట్టుకొని అమ్మితే మరింత లాభంవస్తుంది. అలా నెమ్మదిగా ఒక అరవందరూపాయలు చేసుకుంటే ఓ అయిదారుచెట్లుకొని కాల్చి బొగ్గులవ్యాపారం పెట్టవచ్చును. పట్నంలో అమ్ముతున్న బొగ్గులు తను చూడలేదేమిటి? బొగ్గు సరిగ్గా మండదు గాని బొగ్గులధర మాత్రం మండిపోతూంది. అప్పుడో పదిమంది కూలీలను పెట్టి ఒక అడివి కంట్రాక్టు తీసుకోవచ్చును. నెలకో వందో రెండువందలో కిడితే యీ దరిద్రం వదులుతుంది. వెంకయ్య మళ్ళీ ఆలోచనలోపడ్డాడు.

అప్పుడే పూరిగుడిశ వదిలి మంచి పెంకిటింట్లోకి మారవచ్చు. ఇరుగుపొరుగువారు ఒప్పుకోరుగాని లేకపోతే ఆ గుడిసకు నిప్పంటించాలి. దానితో శని విరగడవుతుంది.

డబ్బుతో బాటే తన వేషభాషలుకూడా మారిపోతాయి. పంచ, సిల్కుచొక్కా, పైమీద వాణీ, తలపాగ, చేతికి వుంగరాలు—ఓ! అప్పుడు చూసుకోండి తన మజా. తన మొహంలోనే ఒక కొత్త కళ వస్తుంది. బేరసారాల్లో బహూ కచ్చితంగా వుంటాడు. కూలీవాళ్ళకీ తనని చూస్తేనే హడలు. వాళ్ళను అదుపులో పెట్టకపోతే వాళ్ళు మన్నల్ని బతకనిస్తారా? అసలు మాయగాళ్ళు. అందులో అంతా కట్టుగడితే యింకేమైనావుందా? వాళ్ళతో బహుజాగ్రత్తగా మసులుకోవాలి.

ఇక నరిసి నగలతో లక్ష్మీదేవిలా తయారవుతుంది. అసలే చక్కని చుక్క. నగలుపెట్టుకుని పట్టుచీర కడితే దాని ముందు ఏ నాయకురాలు నిలబడగలదు. నలుగురి కళ్ళూ పడకుండా చూచుకోవాలంటే...తన కూతురు అప్పటికి పెరిగి పెద్దదవుతుంది. దానికి పెళ్ళిచేస్తాడు. చెయ్యడమంటే యిలా గలాగా, బ్రహ్మాండంగా చేస్తాడు. ఓ వందరూపాయల మందుగుండే కాలుస్తాడు. తన కూలీలందరికీ బూరెలతో అన్నం పెడతాడు. అప్పుడప్పుడు వాళ్ళవలా తృప్తిపడుతూ వుండాలి... నరిసి అసలే అమాయకురాలు, హద్దులేకుండా రెండుచేతుల్లో దానధర్మాలు చేయకుండా కొంచెం చూసుకోవాలి, అంతే.

మళ్ళీ మోచేతిమీద కండచీమ కరిచింది. వెంకయ్య త్రుళ్ళిపడి లేచాడు. పైమీది తుండుగుడ్డ దులిపి పాగాచుట్టి, చుట్ట వెలిగించుకుని బయలుదేరాడు. ఎండ బాగా నెత్తిమీదకొచ్చింది. నిలువుగా పెరిగిన తొగరచెట్టు నీడంతా ఎండకు కరిగి బహు చిన్నదైపోయింది. వెంకడు వెళుతూ, వెళుతూ

మరొకసారి తొగరచెట్టు వేపు పరీక్షగా చూసి మళ్ళీ నడక సాగించాడు. ఆ వెళ్ళడం తిన్నగా బుగతగారింటికే వెళ్ళేడు.

బుగత అప్పుడే భోజనంచేసి వీధివసారాలో కూర్చున్నాడు. నుదుటికీ, జబ్బలకీ, గుండెలకీ విభూతి రాసుకుని, సింధూరం బొట్టు పెట్టుకున్నాడు. ఆయన గొప్ప ఆంజనేయ ఉపాసకుడని ఊళ్లో ప్రతీతి. కొద్దిగా భూమీపుట్రా వున్నవాడు. వ్యవసాయం, దొరికినప్పుడు పౌరోహిత్యం చేసుకుంటూ గంపెడు సంసారం యీదుకుని వస్తున్నాడు. వెంకడ్ని చూడగానే చిరునవ్వొకటి పారేసి "ఏంరా వెంకా, ఏమిలావచ్చావు? అంతా బావున్నారా" అని అడిగాడు.

వెంకడు దండంపెట్టేసి "త్తంబాబూ ఏదో మీ దయవల్ల"

"ఆ... ఆ...నా దయేమిట్రా...అంతా ఆ ఆంజనేయ స్వామి అనుగ్రహంగానీ...ఇంతకీ ఏమిలా వచ్చావు." తానెప్పుడో కర్రలు కొట్టించి నందుకు బాకీవున్న పావలాడబ్బులు వెంకడు యిప్పుడు అడుగుతాడేమోనని బుగత భయం.

"సెరువుకు పడమటిగట్టు ప్రక్కనున్న తొగరసెట్టు మీదే కద బాబూ..."

"ఆహా నాదే, ఎవడేనా కాదన్నాడా?"

"ఎవురు కాదంటారు బాబూ...ఆ సెట్టు నాకిప్పించండి బాబయ్యా, కర్రలు కొట్టుకుని అమ్ముకుంటాను."

"ఓహో, అదా సంగతి.. ఒరే వెంకా చెట్టుచూశావా; బాగా ముదిరిన చెట్టు..."

"అవును బాబు అందుకే...కర్రకొట్టి ఎండబెడితే బాగానే మండుతుంది."

"ఊఁ..అసలింతకీ ఆచెట్టు అమ్మడం నాకేమీ యిష్టం లేదు. నాకది అచ్చొచ్చిన చెట్టురా వెంకా. ఆ మొక్క లేచినప్పటినుంచీ, ఆ పడమటి పొలంలో ప్రతిఏటా ఏ గింజవేసినా బంగారం పండుతూందనుకో."

వెంకయ్యకు నిరాశ కలిగింది. తన ఆశలన్నీ ఆచెట్టు మీద పెట్టుకున్నాడు. ఎలాగైనా బుగతని బతిమాలి ఒప్పించాలనుకున్నాడు వెంకయ్య.

"బాబ్బాబు అలా అనకండి. ఎలాగైనా సరే నాకా సెట్టు యిప్పించండి బాబూ మీ పేరు సెప్పుకుంటాను." అన్నాడు వెంకడు. ఆ చెట్టు వల్ల అక్కడి పొలం పంట ఎక్కువైందని బుగత చెప్పేక వెంకడికి దాని మీద మరీ మోజు ఎక్కువైంది. ఏమో అందులో ఏమి మహాత్యముందో ఎవడికి తెలుసు?"

"ఊఁ. .అయితే నువ్వింతగా బతిమాలుతున్నావుగాబట్టి నీ మాట తోసేలేక పోతున్నాను. సరేకాని అయితే ఇంతకీ ఏమిస్తానంటావా చెట్టుకి? "

వెంకడి మనసు తేలికైంది. ఆ చెట్టువల్ల రానున్న ఐశ్వర్యమంతా అప్పుడే వచ్చేసినట్టే అనుకున్నాడు "బాబూ" మరిన్ని మాటలెందుకు? ఉన్న మాట చెప్తాను. రెండు రోజులు కూలిసేసిన డబ్బులున్నాయి. అయిదు రూపాయలు. తప్పితే నాకాడ ఒక కానీఏనా లేదు అదితీసుకుని ఉత్తినే యిచ్చారనుకొని ఆ సెట్టు యిప్పించండి బాబూ."

"సరేఅయితేమరి, లేనివాడిదగ్గర బేరమాడి ఏమిటి

లాభం? ఇంకోడిక్కైతే పది రూపాయలకి తక్కువకివ్వను.....
తెచ్చావా డబ్బు?

బుగత చాలా గడుసువాడు. వెధవ తొగరచెట్టు రెండు రూపాయలకమ్మినా ఎవరూ కొనడు. వేళావిశేషం బాగుంది గాబట్టి అయిదు రూపాయలొచ్చి పడ్డాయి. వెంకడిచ్చిన అయిదు రూపాయలూ ఒక్కొక్కటే నేల వాయించి చూచుకుని మొలలో దోపుకొన్నాడు.

వెంకడు పరమానందంగా తన కార్యక్రమానికి ఉపక్రమించాడు. ఇంటికెళ్ళి అంబలి తాగి గొడ్డలి పట్టుకొచ్చి చెట్టు నరకడం మొదలు పెట్టేడు.

సాయంకాలం అవబోతూంది. చెట్టు ఒరిగిపోయింది. యింకా నేలనున్న మాను మొండెం విరగ్గొడుతున్నాడు తొగర కర్రగట్టిముంది. మెత్తటి మట్టి పగులిచ్చినట్టు విడిపోతూంది. ఈసారి గొడ్డలి దెబ్బకి ఏదో చిత్రమైన చప్పుడైంది. మళ్ళీ రెండు దెబ్బలు కొట్టేడు. మళ్ళీ అదే చప్పుడు. వేళ్ళూ వేళ్ళూ లాగి పారవేసి, మట్టి పైకి తీసి చూశాడు వెంకడు. ఏదో నల్లటి చిన్నబిందెలాగుంది. తవ్వి పైకితీశాడు. మూత విరగగొట్టి చూశాడు.

తన కళ్ళు తనే నమ్మలేకపోయాడు. లోపల పోతపోసిన బంగారపు దిమ్మలు రెండున్నాయి.

వెంకడు ఆశ్చర్యంతో, ఆనందంతో, భయంతో, సతమతమయాడు. ఈ చెట్టు మహాత్యమిది లక్ష్మీదేవి స్వయంగా తనపై కరుణించింది. ఇక తన కష్టాలు గట్టెక్కాయి.

గొడ్డలిభుజాన వేసుకుని, చూడముచ్చటగావున్న బిందెను చంకబెట్టుకుని ఇంటికి బయులుదేరేడు వెంకడు. ఇప్పుడిక తనకు తొగరు చెట్టుతో పనేముంది గనుక.

ఊళ్లోకి రాగానే ఒకళ్లిద్దరు ఏమిటాబిందె అని అడిగాడు వెంకడు ఏం చెప్పాలో తెలీక, గాబరాపడుతూ "లచ్చిమీదేవి ముట్టకేస్" అన్నాడు. ఇంటికొచ్చి పెళ్ళాన్ని పిలిచి గట్టిగా ఉద్రేకంతో గాబరాపడుతూ చెప్పేడు. పొరుగువాళ్ళువిన్నారు ఈ వార్త ఊరంతా వ్యాపించింది నిముషాల్లో బుగతకికూడా తెలిసింది.

బుగత నలుగుర్ని పెద్దల్ని తీసుకుని వచ్చాడు. దొరికిన సొమ్ము నాదని తగులపెట్టేడు. చెట్టు అమ్మివేసేక నీకు హక్కు లేదన్నాడు వెంకడు.

"చెట్టయితే అమ్మేనుగాని భూమి సీకమ్మలేదే? సొమ్ము చెట్టుమీద దొరికిందా, భూమిలో దొరికిందా?" అని అడిగాడు బుగత.

పెద్ద తగువయింది. చాలామంది జనం మూగేరు. ఊళ్లోవున్న పెద్దలెవ్వరికి వెంకడు హఠాత్తుగా భాగ్యవంతుడు కావడం యిష్టంలేదు. ఎవరో ఒకరిద్దరు కూలీనాలీ చేసుకునే తక్కిన జనమంతా బుగత పక్షమే మాట్లాడేరు. ఇవ్వకపోతే పోలీసుల్ని తీసుకుని వస్తానన్నాడు బుగత. పోలీసులొస్తే దొరికిన సొమ్ము సర్కారుకో బుగతకో పోతుందిగాని తన కెవ్వడిస్తాడు.

ఊళ్లో పెద్దలంతా వెంకడికి బుద్ధిచెప్పేరు. వెంకడికి వేరే గత్యంతరం లేదు. బిందె యిచ్చేశాడు. బుగత సంతోషించి చెట్టుకు పుచ్చుకున్న ఐదురూపాయలూ తిరిగి బహుమానంగా ఇచ్చేశాడు. ఊళ్లోవున్న ఆంజనేయస్వామి కోవిలముందున్న అరుగులు బాగుచేయించడానికి పందరూపాయలిస్తానని వాగ్దానం చేశాడు. అంతా ఏదో సమస్యపరిష్కారమైనట్టుగా తేలికైన మనసులతో ఎవరి మానాన వారు వెళ్ళిపోయారు.

వెంకడు మళ్ళీ తొగరు చెట్టు దగ్గరికి బయలుదేరేడు, మాను యింటికి మోసుకురావడానికి.